ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 1 కర్ణాటక వార్తలు
శుక్రవారం 26 ఏప్రిల్ 2024




వేసవిలో కళ్ల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి

బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవిలో కళ్ల పట్ల కనీస జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రుల రీజనల్ డైరెక్టర్ శ్రీపతి సూచించారు.. ఈమేరకు శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎండలు మండి పోతున్నందున సూర్యకిరణాలు, దుమ్ము, ధూళితో కళ్ల ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. కంటి సమస్యలు తలెత్తితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కళ్లల్లో తేమశాతం తగ్గితే బ్యాక్టీరియా ప్రభావంతో మంటలు వస్తాయన్నారు. క్యాటరాక్ట్, మాక్యులర్, డీ జనరేషన్ వంటి సమస్యలు వస్తాయన్నారు.

రండి..రండి..ఓటెయ్యండి..!

- నేడు ఓటరే దేవుడు
- 14 స్థానాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- బెంగళూరు గ్రామీణలో భారీ భద్రత
- ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- మొబైల్ ఫోన్లకు నో ఎంట్రీ



బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సమరంలో ప్రధానఘట్టమైన పోలింగ్ మరి కొన్ని గంటల్లో ప్రారంభం కానుంది. నెల రోజులకు పైగా రాత్రింబవళ్లు అభ్యర్థులు చేసుకున్న ప్రచారానికి ఫలితం రానుంది. నేడు ఓటరే అభ్యర్థులు, రాజకీయ పార్టీల పాలిట దేవుడు. రాష్ట్రంలో 28 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా తొలి విడతలో 14 లోక్‌సభ స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరగనుంది. 247మంది అభ్యర్థులు బరిలో ఉండగా 2.88 కోట్లమంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. దక్షిణకన్నడ, ఉడుపి-చిక్కమగళూరు, చిత్రదుర్గ, కోలారు, మండ్య, హాసన్, మైసూరు-కొడగు, చిక్కబళ్లాపుర, తుమకూరు, బెంగళూరు ఉత్తర, బెంగళూరు దక్షిణ, బెంగళూరు సెంట్రల్, బెంగళూరు గ్రామీణ, చామరాజనగర స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. 30,602 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 14 స్థానాల్లో కోలారు, చామరాజనగర, చిత్రదుర్గ రిజర్వు నియోజకవర్గాలుగా ఉన్నాయి. 2,88,08,182మంది ఓటు వినియోగించుకునేందుకు అర్హులు కాగా తొలిసారి ఓటు వేసేవారు 5,99,44మంది ఉన్నారు. బెంగళూరు ఉత్తరలో 2,911 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.



ఎన్నికల కిట్‌ను పరిశీలిస్తున్న బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్

7 గంటల నుంచే..

ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 6వరకు పోలింగ్ జరగనుంది. రాష్ట్ర ఎన్నికల విభాగం పోలింగ్ సజావుగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బెంగళూరు గ్రామీణ నియోజకవర్గ వ్యాప్తంగా వెబ్‌కాస్టింగ్, రెండంచెల సాయుధ పోలీసు బందోబస్తు కల్పించారు. చామరాజనగర, మైసూరు - కొడగు, ఉడుపి-చిక్కమగళూరు స్థానాల పరిధిలో అటవీ ప్రాంతాల్లో గిరిజనులకు అనుకూలంగా పోలింగ్‌బూత్‌లు ఏర్పాటు చేశారు. ప్రతి నియోజకవర్గ పరిధిలోనూ మహిళలకోసం సఖి పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేశారు. కాగా సక్షమ యాప్ ద్వారా దివ్యాంగులు ఉచిత వాహన సదుపాయం పొందే వెసలుబాటు ఉంది.



14 స్థానాల నుంచి 247మంది అభ్యర్థులు బరిలో ఉండగా 226మంది పురుషులు కాగా 21మంది మహిళలు ఉన్నారు. అత్యధికంగా చిక్కబళ్లాపురలో 29మంది, బెంగళూరు సెంట్రల్‌లో 24మంది, బెంగళూరు దక్షిణ 22మంది, బెంగళూరు ఉత్తర 21మంది, చిత్రదుర్గ 20, తుమకూరు, మైసూరులలో 18మంది చొప్పున, ఉడుపి-చిక్కమగళూరు 10, హాసన్ 15, మండ్య 14, చామరాజనగర 14, బెంగళూరు గ్రామీణ 15, కోలారు 18 మంది ఉండగా దక్షిణకన్నడలో అత్యల్పంగా 9మంది అభ్యర్థులు ఉన్నారు. 14స్థానాల్లోనూ బీజేపీ - జేడీఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్యనే ప్రధానమైన పోటీ సాగుతోంది. ఎన్నికల్లో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె, మాజీ సీఎం కుమారస్వామి, పరిషత్ ప్రతిపక్షనేత కోట శ్రీనివాసపూజారి, బీసీ కమిషన్ ఛైర్మన్‌గా వ్యవహరించిన జయప్రకాశ్ హెగ్డే, హృద్రోగ నిపుణుడు, పద్మశ్రీ గ్రహీత డాక్టర్ సీఎన్ మంజునాథ్, ప్రొఫెసర్ రాజీవ్‌గౌడ, మైసూరు యువరాజు యదువీర్‌తోపాటు మంత్రి రామలింగారెడ్డి కుమార్తె సౌమ్యారెడ్డి, మంత్రి మహదేవప్ప కుమారుడు సునిల్‌బోస్‌తోపాటు డీసీఎం డీకే శివకుమార్ తమ్ముడు, సిట్టింగ్ ఎంపీ డీకే సురేశ్‌లు ప్రముఖులు కాగా కోలారు, దక్షిణకన్నడ, చామరాజనగర నుంచి ఇరుపార్టీల తరపున కొత్త అభ్యర్థులు బరిలో ఉన్నారు. మాజీ మంత్రులు సోమణ్ణ, సుధాకర్, మాజీ ఎంపీలు ముద్ద హనుమేగౌడ, చంద్రప్ప బరిలో ఉన్నారు.



సిద్ధమైన సాయుధబలగాలు



సిబ్బంది కోసం ఫ్రీడం పార్కులో బస్సులు



పోలింగ్ సామగ్రితో సిబ్బంది



ఓటు వేస్తే టిఫిన్ ఫ్రీ..

బెంగళూరులో ఓటర్లను ఆకర్షించేందుకు చిత్ర విచిత్రమైన ఆఫర్లను ప్రకటిస్తున్నారు. నగరం దేశ విదేశాలలో భిన్నమైన అంశాలలో పేరు పొందింది. అయితే గడిచిన కొన్ని దశాబ్దాలుగా జరిగిన ఎన్నికల్లో పోలింగ్‌శాతం తగ్గుతూ వస్తోంది. అందుకు హోటళ్లు, పబ్‌లు, ట్యాక్సీలు ఓటర్లను ఆకట్టుకునేలా రాయితీలు, ఆఫర్‌లు ప్రకటిస్తున్నారు. నృపతుంగ రోడ్డులోని నిసర్గ గ్రాండ్ హోటల్‌లో పోలింగ్ రోజున శుక్రవారం ఓటు వినియోగించుకున్నవారు ఎవరికైనా ఉచితంగా వెన్న దోస, ఘీ రైస్, ఫ్రూట్ జ్యూస్ అందజేయనున్నట్లు ప్రకటించారు. బెళ్లందూరులోని రెస్టో పబ్ డెక్ ఆఫ్ బ్రూస్ మరో ఆఫర్ ప్రకటించింది. ఓటు వినియోగించుకున్నవారు ఈనెల 27, 28 తేదీలలో ఉచితంగా మగ్ బీర్ ఆఫర్ చేసింది. పబ్‌లో అన్నింటిపైనా డిస్కౌంట్‌లను ప్రకటించింది. పబ్ యజమాని ప్రఫుల్లా రాయ్ అభిప్రాయం మేరకు ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్య శక్తి పెంచాలని తమవంతుగా ఆఫర్‌లు ఇచ్చామన్నారు. ఇక పలు హోటళ్లు పోలింగ్ రోజున ఓటు వేస్తే 20శాతం రాయితీని ప్రకటించాయి. నగరంలోని ఇంప్రాసారియా ఎంటర్‌టైన్‌మెంట్, హాస్పిటాలిటీ సీఈఓ దివ్య అగర్వాల్ ప్రకటించారు. ర్యాపిడో ఉచిత రైడ్ ట్యాక్సీ సదుపాయం ప్రకటించింది. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్‌లకు ఉచిత ఆటో క్యాబ్‌లను నడపనుంది. ఇక వండర్‌లా అమ్యూజ్‌మెంట్ పార్క్ ఓటు వేసినవారికి 15శాతం రాయితీ ఇస్తున్నట్టు ప్రకటించారు. ఈ ఆఫర్ ఈనెల 28వరకు ఉంటుందని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలోనూ సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు.

14 స్థానాలు.. 2.88 కోట్ల మంది ఓటర్లు

బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ తొలి విడతలో 14 స్థానాలకు 247మంది అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. 2.88 కోట్లమంది వారి భవిష్యత్తును నిర్ణయించనున్నారు.

నియోజకవర్గం	పోలింగ్	పురుషులు కేంద్రాలు	మహిళలు	ఇతరులు	సర్వీస్ ఓటర్లు	మొత్తం
ఉడుపి చిక్కమగళూరు	1842	7,68,215	8,16,910	37	559	15,85,721
హాసన్	2221	8,63,727	8,72,840	43	2208	17,38,818
దక్షిణకన్నడ	1876	8,86,642	9,30,884	77	524	18,18,127
చిత్రదుర్గ	2168	9,25,543	9,31,229	104	509	18,57,385
తుమకూరు	1846	8,19,065	8,42,170	74	525	16,61,834
మండ్య	2076	8,76,112	9,02,963	168	906	17,80,149
మైసూరు	2202	10,26,324	10,65,714	184	2088	20,94,310
చామరాజనగ	2000	8,78,702	8,99,501	107	357	17,78,667
బెంగళూరు గ్రామీణ	2829	14,24,685	13,77,570	325	376	28,02,956
బెంగళూరు ఉత్తర	2911	16,48,978	15,64,914	604	765	32,15,261
బెంగళూరు సెంట్రల్	2125	12,54,642	11,78,642	467	503	24,34,254
బెంగళూరు దక్షిణ	2120	12,07,291	11,34,068	400	136	23,41,895
చిక్కబళ్లాపుర	2326	9,83,775	9,97,306	266	420	19,81,767
కోలారు	2060	8,53,829	8,72,874	211	1284	17,28,198

మెట్రో సేవల విస్తరణ

బెంగళూరులో పోలింగ్ ఉన్నందున శుక్రవారం మెట్రో సేవలను విస్తరించామని బీఎంఆర్‌సీఎల్ ప్రకటించింది. రాత్రి 12 గంటల దాకా నమ్మ మెట్రో సేవలు కొనసాగుతాయన్నారు. మెజస్టిక్ ఇంటర్‌చేంజ్ నుంచి నాలుగువైపులా వెళ్లే రైళ్ళు శుక్రవారం రాత్రి 12.35కు బయల్దేరుతాయని ప్రకటించారు. ఓటర్లతోపాటు పోలింగ్ సిబ్బందికి ఈ రైళ్లు ఉపయోగపడ తాయన్నారు.

నేహా కుటుంబానికి సీఎం పరామర్శ



నేహా తల్లిదండ్రులను ఓదారుస్తున్న సీఎం సిద్ధరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హత్యకు గురైన ఎంసీఏ విద్యార్థిని నేహా హిరేమఠ కుటుంబాన్ని సీఎం సిద్దరామయ్య పరామర్శించారు. గురువారం రాత్రి హుబ్బళ్ళికి చేరుకున్న ఆయన తొలుత నేహా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తల్లిదండ్రులను ఓదార్చారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని భరోసా ఇచ్చారు. ఇకపై ఇలాంటి ఘటనలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ విద్యార్థిని హత్యపై ఇప్పటికే సీఐడీ దర్యాప్తు చేస్తోందని నిందితుడికి తగిన శిక్ష పడేలా చేస్తుందన్నారు.

మల్లేశ్వరంలో యూనియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం ప్రారంభం



జోనల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న యూనియన్ బ్యాంకు ఎండీ, సీఈఓ మణిమేఖలై

బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ప్రముఖమైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త జోనల్ కార్యాలయాన్ని ఎండీ, సీఈఓ మణిమేఖలై లాంఛనంగా ప్రారంభించారు. గురువారం మల్లేశ్వరంలో జరిగిన కార్యక్రమంలో బెంగళూరు జోనల్ హెడ్ నవనీత్‌కుమార్, రీజనల్ హెడ్ అనీస్‌కుమార్, రాజేంద్రకుమార్, జే మహేశా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్‌బ్యాంకు ఎండీ సీఈఓ మణిమేఖలై మాట్లాడుతూ బ్యాంకు కార్యకలాపాల సరళీకృతంతోపాటు సేవలు వేగవంతంగా ఖాతాదారులకు అందించేందుకోసం జోనల్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. కర్ణాటకలో 9 రీజియన్‌లు, 607 బ్యాంకు శాఖలు ఉన్నాయన్నారు. మల్లేశ్వరంలో జోనల్ కార్యాలయం ఏర్పాటు ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా బ్యాంకు కార్యకలాపాలకు అందుబాటులో ఉన్నట్టయ్యిందన్నారు.




నగరంలోని పలికేహళ్ళిలో మహిళల కోసం ఏర్పాటు చేసిన సఖి పోలింగ్ సెంటర్




ఆశీర్వదించండి..

తొలి విడత సమరానికి అంతా సిద్ధం అయ్యింది. నెలరోజులకుపైగా హోరుగా సాగిన ప్రచారం ముగిసింది. ప్రజలను ప్రసన్నం చేసుకోవడానికి నేతలు ముమ్మరంగా ప్రయత్నించారు. శుక్రవారం నాటి ఎన్నికల బరిలో హేమాహేమీలు పోటీ చేస్తున్నారు. 14 లోక్ సభ స్థానాలకు జరుగుతున్న ఎన్నికల్లో 247మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పోటీలో ఉన్న అభ్యర్థులు వీరే..

- బెంగళూరు ఆంధ్రజ్యోతి




బెంగళూరు ఉత్తర రాజీవ్‌గౌడ్ (కాంగ్రెస్)


శోభాకరంద్లాజె (బీజేపీ)


బెంగళూరు దక్షిణ తేజస్వి సూర్య (బీజేపీ)


సౌమ్యారెడ్డి (కాంగ్రెస్)


సెంట్రల్ మన్సూర్ అలిఖాన్ (కాంగ్రెస్)


పీసీ మోహన్ (బీజేపీ)



బెంగళూరు గ్రామీణ డీకే సురేశ్ (కాంగ్రెస్)


డాక్టర్ సీఎన్ మంజునాథ్ (బీజేపీ)


చామరాజనగర బాలరాజు (బీజేపీ)


సునిల్‌బోస్ (కాంగ్రెస్)


చిత్రదుర్గ గోవింద కారజోళ (బీజేపీ)


బీఎన్ చంద్రప్ప (కాంగ్రెస్)


చిక్కబళ్ళాపుర డాక్టర్ కే సుధాకర్ (బీజేపీ)


రక్షా రామయ్య (కాంగ్రెస్)


కోలారు మల్లేశబాబు (జేడీఎస్)


కేవీ గౌతమ్ (కాంగ్రెస్)



మండ్య హెచ్‌డీ కుమారస్వామి (జేడీఎస్)


వెంకటరమణేగౌడ (కాంగ్రెస్)


దక్షిణకన్నడ కెప్టెన్ బ్రిజేశ్ చౌట (బీజేపీ)


పద్మరాజ్ ఆర్ పూజారి (కాంగ్రెస్)


కొళ్ళేగాలలో భరచుక్కి జలపాతం నమూనాతో సెల్ఫీపాయింట్


హసన్ ప్రజ్వల్ (జేడీఎస్)


శ్రేయస్ పటేల్ (కాంగ్రెస్)


మైసూరు యదువీర్ (బీజేపీ)


లక్ష్మణ్ (కాంగ్రెస్)


తుమకూరు వీ సోమణ్ణ (బీజేపీ)


ముద్దహనుమేగౌడ (కాంగ్రెస్)



ఉడుపి జయప్రకాశ్ హెగ్డే (కాంగ్రెస్)


కోట శ్రీనివాస పూజారి (బీజేపీ)


చామరాజనగర జిల్లా అలత్తూరులో ముస్తాబైన పోలింగ్‌కేంద్రం

సీఎం కుర్చీ నుంచి దిగినా పోరాటం చేయాలి

● ఖర్గే వ్యాఖ్యలతో సిద్దూ వర్గీయుల్లో కలకలం



బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య ముఖ్యమంత్రి పదవి నుంచి దిగినా పోరాటం చేయాలని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాలలో హల్‌చల్ చేస్తున్నాయి. కలబురగి లోక్‌సభ స్థానం అఫజల్‌పుర కాంగ్రెస్ కార్యకర్తల సభలో మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ సిద్దరామయ్య సీఎంగా ఉండనీ లేదా పదవిలో లేకున్నా పోరాటం చేయాలన్నారు. తత్వ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సిందే అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలకు ఓటమి దక్కేదాకా వదిలేది లేదన్నారు. ఎంపై పాటిల్ చెప్పినట్లుగా ఇవే నా చివరి ఎన్నికలు అనేది లేదని నేను పుట్టిందే రాజకీయాల కోసమన్నారు. రాజకీయాల నుంచి రిటైర్డ్ అయ్యేది లేదని తుదిశ్వాస దాకా పోరాటం ఉంటుందన్నారు. తాను ఎన్నికలలో పోటీ చేయనని భవిష్యత్తులో చేసేది లేదని కానీ రాజకీయాలకు మాత్రం దూరంగా ఉండేది లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో నాయకత్వం మార్పు ఉంటుందని బీజేపీ నేతల ఆరోపణలే కాకుండా నిత్యం కాంగ్రెస్‌లోని డీసీఎం డీకే శివకుమార్ గ్రూపులోను చర్చలు సాగుతున్న తరుణంలోనే ఏకంగా కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే వ్యాఖ్యలు ప్రస్తుతం హల్‌చల్ చేస్తున్నాయి. కాగా సిద్దరామయ్య వర్గీయులలో కొంత నిరాశ కలిగిస్తోంది. ఏది ఏమైనా లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్ర రాజకీయాలు వేడెక్కుతాయనేది మాత్రం జోరుగా ప్రచారం సాగుతోంది. 2023లో శాసనసభ ఎన్నికల ఫలితాల తర్వాత డీకే శివకుమార్ ముఖ్యమంత్రి పదవి కోసం పట్టుబట్టారు. నాలుగైదు రోజుల ప్రతిష్టంభన తర్వాత ఎట్టకేలకు సిద్దరామయ్య, డీకే శివకుమార్‌ల మధ్యన ఒప్పందం కుదిర్చిన తర్వాతనే సీఎంగా సిద్దరామయ్య పేరు ప్రకటించారు. రాజీవేళ రెండున్నరేళ్ళ ఒప్పందమా లేక లోక్‌సభ ఎన్నికల వరకా అనేది ఎక్కడా స్పష్టత లేదు. ఇదే సందర్భంలోనే మల్లికార్జునఖర్గే వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి.

సుమలత మద్దతు ఎవరికో..?


● గందరగోళం కలిగించేలా ట్వీట్ ● ఎటూ తేల్చుకోలేని అభిమానులు



బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండ్య ఎంపీ సుమలత మద్దతు ఎవరికో అనేది గందరగోళంగా మారింది. ఇటీవల ఆమె బీజేపీలో చేరారు. అయితే టిక్కెట్ దక్కక పోవడంతో నిరాశలో నిలిచారు. బీజేపీ-జేడీఎస్ పొత్తులో భాగంగా మండ్య స్థానం జేడీఎస్‌కు దక్కింది. ఇక్కడనుంచి కుమారస్వామి పోటీ చేస్తున్నారు. మండ్య అంటే సుమలత అంబరీశ్‌కు అభిమానం కల్గిన ప్రాంతం. ఆమె ప్రచారం చేయడం ద్వారా గెలుపు సునాయాసం అవుతుందని భావించారు. అయితే బీజేపీకి మద్దతు ఇస్తున్నా మండ్యలో ప్రచారానికి సుమలత వెనుకడుగు వేశారు. ప్రచారం గడువు ముగిసింది. తాజాగా సుమలత గురువారం చేసిన ట్వీట్ ఆమె అభిమానులకే కాదు రాజకీయ నాయకులకు సైతం గందరగోళంగా మారింది. 'ఏం చెప్పాలనేది జ్ఞానం, ఎలా చెప్పాలనేది వ్యక్తిత్వం, ఎంత చెప్పాలనేది నైపుణ్యత, చెప్పాలో వదిలిపెట్టాలో అనేది వివేకం' అంటూ ట్వీట్ చేశారు. మండ్య నుంచి నా అభిమానులు జేడీఎస్-బీజేపీ అభ్యర్థి కుమారస్వామికి ఓటు వేయాలా లేక వద్దా అనేది ట్విస్ట్‌గా మారింది. 2019 ఎన్నికల్లో కుమారస్వామి తనయుడు నిఖిల్ ఇదే స్థానం నుంచి తలపడ్డాడు. అప్పుడు కాంగ్రెస్‌తో జేడీఎస్ మైత్రి ఉండేది. కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలు కలసి పని చేసినా ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన సుమలత సునాయాసంగా గెలుపొందారు. అయితే అభిమానుల కోరిక మేరకు బీజేపీలోకి వచ్చిన ఆమెకు టిక్కెట్ దక్కకపోవడం నిరాశ మిగిల్చింది. మండ్యలో అంబరీశ్ కుటుంబాన్ని అమితంగా ఆదరించే అభిమానుల్లో ఇప్పుడు ఆందోళన నెలకొంది. ఎవ్వరికి ఓటెయ్యాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

బీజేపీ నేతల సహకారం లేదు

● మాజీ ప్రధాని దేవెగౌడ



బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హాసన్, మండ్య లోక్‌సభ స్థానాలలో కొందరు బీజేపీ నేతల నుంచి తమకు సహకారం లేదని జేడీఎస్ జాతీయ అధ్యక్షులు దేవెగౌడ అభిప్రాయపడ్డారు. గురువారం హాసన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీ - జేడీఎస్ పొత్తుతో పోటీ చేస్తున్నామన్నారు. జేడీఎస్ అభ్యర్థులుగా మండ్య నుంచి కుమారస్వామి, హాసన్ నుంచి ప్రజ్వల్, కోలార్ నుంచి మల్లేశ్ బాబు పోటీ చేస్తున్నారన్నారు. హాసన్‌లో బీజేపీకి చెందిన ముఖ్యనాయకుడు ఒకరు సహకరించడం లేదని మాజీ ఎమ్మెల్యే ప్రీతంగౌడను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రీతం పేరు చెప్పకుండానే దేవేగౌడ పలు వ్యాఖ్యలు చేశారు. ఒప్పందానికి అనుగుణంగా సహకారం లభించడం లేదన్నారు. మండ్యలోను ఇదే పరిస్థితి ఉందని సిట్టింగ్ ఎంపీ సుమలత సహకరించడం లేదన్నారు. ప్రమాదమేమి లేదని అయినా పార్టీ నిర్ణయాలకు కట్టుబడాలన్నారు. కావేరీ నదీ పరివాహక ప్రదేశాలలో పర్యటించానని ప్రతి చోటా గెలుపు ఖాయమనే సంకేతాలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో తాగునీటి సమస్య గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్ళానన్నారు. మేకెదాటు ప్రాజెక్టు నిర్మాణాలకు సంబంధించి కేంద్ర జలవనరుల శాఖా మంత్రితోను చర్చించానన్నారు. ప్రధాని మోదీకి డీఎంకే మద్దతుతో అధికారం నడిపే పరిస్థితి లేదన్నారు. తమిళనాడులో బీజేపీ ఖాతా తెరుస్తుందన్నారు. దేశసంపదను సమానంగా పంచుతామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నా అధికారంలోకి వచ్చే శక్తి లేదన్నారు. మనసుకు తోచినట్లు చెబుతున్నారని భూమి, సంపదను పంచుతామని రాహుల్‌గాంధీ చెబుతున్నారని ఇది ఎంతవరకూ సమంజమన్నారు.

ఎవరు కావాలో ఆలోచించుకోండి..!

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 25: మాదిగలకు హక్కుగా అందాల్సిన సంక్షేమ పథకాలను రద్దుచేసిన సీఎం జగన్, ఐదేళ్ల నుంచి ఆ వర్గ ప్రజలను రోడ్డున పడేశారని మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి నాయకులు మండిపడ్డారు. భవిష్యత్తులో జగన్ కావాలో సంక్షేమాన్ని అందించిన చంద్రబాబు కావాలో విజ్ఞతగా ఆలోచించాలని మాదిగలకు సూచించారు. ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప అధ్యక్షతన పెన్నర్ల భవన్‌లో మాదిగ కుల సంఘాల ఐక్య కూటమి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌జే ప్రకాష్, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు, జైమాదిగ సేవా సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు బెంజిమన్, మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్, నవ్య చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, బేడ, బుడగ జంగం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మాదిగలపై దౌర్జన్యకాండ సాగిందని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ చేసి సంక్షేమ పథకాలను అమలుచేసే నారా చంద్రబాబునాయుడిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

నచ్చిన వాళ్లకు ఓటేసేవాళ్లం



నేను యుక్త వయసులో ఉండగా ఆంధ్రప్రదేశ్ ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఎమ్మెల్యేగా పోటీ చేసేవారు గ్రామాలకు గ్రామ పెద్దలను కలిసేవారు. మద్దతు కోరేవారు. అయితే మాకు ఏ అభ్యర్థి నచ్చితే వారికి ఓటు వేస్తాం అని నిర్మొహమాటంగా గ్రామ పెద్దలు చెప్పేవారు. ఇప్పటిలా ఓటును డబ్బుకు, మందుకు అమ్ముకునే వాళ్లం కాదు. ఎన్నికల రోజు గ్రామ పెద్దలు ఉగ్గని పెట్టెవారు. ఉగ్గని తిని ఎద్దుల బండిలో వెళ్లి ఓటు వేసి వచ్చేవాళ్లం.

- బత్తలపల్లి

ఇప్పటి దాకా ఆ పార్టీకే ఓటు



మొదటి నుంచి కూడా బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించే పార్టీకే ఓటు వేస్తూ వచ్చాం. నాకు ప్రస్తుతం 70 సంవత్సరాలు. 1983లో ఎన్టీఆర్ పార్టీ పెట్టి రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు తీసుకొచ్చాడు. దాన్ని మేమంతా గొప్పగా భావించాం. అందుకే అప్పటి నుంచి టీడీపీకే ఓటు వేస్తున్నాం. వైసీపీ వాళ్లు పింఛన్ విషయంలో వృద్ధులను మోసం చేశారు. చంద్రబాబు వస్తే నెలకు రూ.4వేలు ఇస్తానని చెబుతున్నాడు. వృద్ధుల పట్ల శ్రద్ధ చూపేవారికే ఓటు వేస్తాం. పింఛన్ పెంచుతానని చెబుతున్నారు కాబట్టి ఈ సారి మాలాంటి వృద్ధులతో పాటు, దివ్యాంగులు, వితంతువుల ఓట్లు టీడీపీకే పడతాయి.

- శింగనమల

కొత్త కొత్తగా...

తొలిసారి ఓటేయనున్న 5973 మంది



ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లు వేల సంఖ్యలో పెరిగారు. వారంతా తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో 18-19సంవత్సరాలు కలిగిన దాదాపు 5973 మంది యువ ఓటర్లుగా నమోదయ్యారు. వీరంతా విజన్ ఉన్న నాయకుడు, సంపద, ఉపాధి, ఉద్యోగాలు సృష్టించి యువత భవితకు గ్యారెంటీ ఇచ్చే నాయకుడిని ఎన్నుకోవడానికి సిద్ధమైనట్లు చెబుతున్నారు. నియోజకవర్గం అభివృద్ధి చేసే పార్టీకే ఓటు వేస్తామని ముక్త కంఠంతో చెబుతున్నారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు తలొగ్గమని, బాధ్యతగా, ప్రజాస్వామ్యం పట్ల నమ్మకంతో ఓటు వేస్తామని చెబుతున్నారు.

- గుంతకల్లుటౌన్

చేనేత వరం..

● ప్రపంచ ఖ్యాతిగాంచిన ధర్మవరం పట్టుపరిశ్రమ

ధర్మవరం : దర్మవరం పేరెత్తగానే టక్కున గుర్తు వచ్చేది పట్టుచీరలు. ఇక్కడ చీరల తయారీలో కార్మికుల కళా నైపుణ్యానికి కొదవలేదు. అగ్గిపెట్టెలో ఒదిగేలా పట్టుచీరలు తయారు చేసిన నేతన్న సంపంగి, మయూరా, పద్మారవింద వంటి ఎన్నో సృజనాత్మకతతో కూడిన పట్టువస్త్రంపై తమ కళానైపుణ్యంతో మగువ మెచ్చేలా తయారు చేయడంలో ఇక్కడి నేత కార్మికుల సొంతం. ఇక్కడ తయారు చేసిన పట్టుచీరలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. పేరుకే గుర్తింపు ఉంది కానీ ఆ నేతన్నలు కడుపు మాత్రం నింపలేని పరిస్థితి పట్టుపరిశ్రమలో నెలకొంది. కనీస ధర కూడా లేకపోవడంతో నేతన్నలు పడుతున్న బాధలు వర్ణనాతీతమే. చేనేత తరువాత వ్యవసాయంపై కూడా ఈ ప్రాంతంలో అధిక సంఖ్యలో ఆధారపడి జీవిస్తున్నారు. నాయకులు ఈ రెండు రంగాలను పెద్దగా పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. నియోజకవర్గంలో చెరువులు నిండినా ఆయకట్టు భూములు మాత్రం సాగులోకి రాకపోవడం ఇక్కడి రైతాంగాన్ని కుంగదీస్తోంది. గత ఏడాది నుంచి తాగునీరు కూడా ధర్మవరానికి ప్రధాన సమస్యగా మారింది. డంపింగ్ యార్డ్ లేక ఎక్కడపడితే అక్కడ చెత్తను వేసే పరిస్థితి మున్సిపాలిటీలో ఏర్పడింది.

● శ్రీకృష్ణదేవరాయల కాలంలో సామంతరాజులుగా ఉన్న క్రియాశక్తి వడియార్ అప్పట్లో వర్షాలు బాగా వస్తున్నా నీరు నిల్వ ఉండేందుకు బావులు పెద్దగా లేకపోవడంతో ధర్మవరం చెరువును తవ్వించారు. చెరువుకు ఏడు మరువలు పెట్టారు. ఒకసారి భారీ వర్షం కారణంంగా ఏడు మరువలు పొంగి పొర్లుతున్నాయి. మరువలు తెగిపోతే చాలా గ్రామాల్లోని ప్రజలు నీటమునిగి పోతారని తెలుసుకున్న చెందిన ధర్మాంబ అనే మహిళ మరువ వద్ద కట్ట తెగిపోకుండా ఉండేందుకు ఆమె అడ్డంగా పడుకుని ప్రాణత్యాగం చేసింది. అప్పుడు గంగమ్మ శాంతించి మరువలు తెగిపోలేదని పురాణాలు చెబుతున్నాయి. చెరువు మరువలు తెగిపోకుండా ప్రాణత్యాగం చేసిన ధర్మాంబ అనే మహిళ పేరును పెట్టారు. కాలక్రమేనా ధర్మాంబ పేరు ధర్మవరంగా మారిందని పెద్దలు చెబుతున్నారు.

● ధర్మవరం పట్టణంలో చెన్నకేశవుడి రథోత్సవాలు పది రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. తాడిమర్రి మండలంల మహాశివరాత్రికి చిల్లవారిపల్లి కాటకోటేశ్వరక్షేత్రంలో ఉత్సవాలు కూడా వైభవంగా నిర్వహిస్తారు. బత్తలపల్లి మండల కేంద్రంలో మొహరం వేడుకలలో భాగంగా పీర్ల స్వాముల భేటీ కార్యక్రమాన్ని కూడా ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. ముదిగుబ్బమండలంకమ్మవారిపల్లి గ్రామంలో వీర నారాయణస్వామి ఉత్సవాలు జరుగుతాయి.



● ఉమ్మడి అనంతపురం జిల్లాలో భాగమైన ధర్మవరం మ ద్రాసు రాష్ట్రం ఉన్నప్పుడే నియోజకవర్గంగా ఏర్పడింది. నియోజకవర్గ విస్తీర్ణం 1,33,361 హెక్టార్లు ఉండగా, 3,04706 జనాభా ఉంది. ఇందులో పురుషులు 1,55,211 మంది, మహిళలు 1,49,495 మంది ఉన్నారు. జిల్లాల పునర్విభజన తరువాత పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లాగా అవతరించి ధర్మవరం నియోజకవర్గం ఆ జిల్లాలో భాగమైంది. ఇప్పటి వరకు 15 సార్లు అ సెంబ్లీ ఎన్నికలు జరిగాయి. 1951లో నియోజకవర్గం ఏ ర్పాటుకాగా 1952లో మొదటిసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ తరఫున ధర్మవరం పట్టణానికి చెందిన కాశెట్టి శ్రీనివాసులు గెలుపొందారు. ఈయన తన ప్రత్యర్థిపై 16,072 ఓట్లమెజారిటీతో గెలుపొంది మొట్టమొదటి ఎమ్మెల్యేగా సుస్థిరస్థానాన్ని పొందారు. ఎంతో మంది ఎమ్మెల్యేలుగా, జిల్లా పరిషత్ చైర్మన్లుగా, రాష్ట్ర మంత్రులుగా, పీసీసీచీఫ్, ఎమ్మెల్సీలుగా ప్రాతినిధ్యం వహించిన ఘన చరిత్ర ఉంది. 1983లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసిన గరుడమ్మగారి నాగిరెడ్డి 30,605 ఓట్ల అత్యధిక మెజార్టీ సాధించారు. 1994లో టీడీపీ తరఫున పోటీచేసిన గుత్తా వెంకటనాయుడు 1070 అత్యల్ప మెజారిటీ సాధించారు.

ధర్మవరంలో పలు అంశాలు ఎన్నికలను ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇక్కడ ప్రధానంగా చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారు. వీరిపై ఎటువంటి ఇబ్బంది కల్గించిన వారి నుంచి తీవ్ర ప్రభావంచూపే అవకాశం లేకపోలేదు. రైతులకు కూడా సరైన సమయంలో సరైన సహకారం అందించకపోతే ఆ ప్రభుత్వంపై అసంతృప్తి రాగాలు పెల్లుబుకే అవకాశం ఉంటుంది. దీంతో పాటు పింఛన్లు, రోడ్ల సమస్యలపై ప్రజలు అసంతృప్తిని వెళ్లగక్కనున్నారు. తాగు, సాగు నీరు కూడా సక్రమంగా అందించకపోతే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సిన పరిస్థితి ఇక్కడ ప్రధానంగా నెలకొంటుంది. ఇక్కడ ఎవరైనా కబ్జాలు, భూదందాలు, అవినీతికి పాల్పడిన ఆ పార్టీకి ఓటు బ్యాంకు రూపంలో ఇబ్బందికరంగా మారే పరిస్థితి ఉంటుంది.

● దర్మవరం నియోజకవర్గం తొలి అసెంబ్లీ అభ్యర్థిగా 1952లో కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ తరఫున పోటీ చేసిన కాశెట్టి శ్రీనివాసులు తమ సమీప ప్రత్యర్థి కాంగ్రెస్‌కు చెందిన జి.వెంకటరెడ్డిపై 16,056 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కాశెట్టి శ్రీనివాసులు మగ్గం నేసుకుంటూ అప్పటి ధర్మవరం ప్రజల అభీష్టం మేరకు పోటీ చేసి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఆయన గెలుపొందిన తరువాత తమకున్న ఆస్తులను సైతం ప్రజా ఉపయోగ కార్యక్రమాలకు కేటాయించారని ఇప్పటికి స్థానికులు చెబుతుంటారు. ప్రస్తుతం వీరి కుటుంబం మొత్తం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లింది. మగ్గంతోపాటు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. ప్రస్తుతం ఆ కుటుంబం ఆయనతోనే రాజకీయాలకు స్వస్తి పలికినట్లయింది.

● ధర్మవరం నియోజకవర్గం ఏర్పడిన తరువాత 15 సార్లు ఎన్నికలు నిర్వహించగా ఇందులో తెలుగుదేశం ఆరుసార్లు, కాంగ్రెస్ ఆరుసార్లు, వైపీపీ ఒకసారి, ఇండిపెండెంట్ ఒకసారి, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ ఒకసారి గెలుపొందాయి. ఇందులో అత్యధికం, అత్యల్ప మెజార్టీలు టీడీపీ అభ్యర్థులకే దక్కాయి. గరుడమ్మగారి నాగిరెడ్డి ఒక్కరే మూడు సార్లు గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. ఈయన తెలుగుపార్టీ ఆవిర్భావం నుంచి 1983 నుంచి వ రుసగా మూడు సార్లు గెలుపొం ది మంత్రిగా పనిచేశారు. ధర్మవరం చేనేత పరిశ్రమకు, నిమ్మలకుంట తోలుబొమ్మలకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచడం ఈ నియోజకవర్గంలో ప్రత్యేకతను చాటుకుంది.

● ధర్మవరం మండలంలో నడిమిగడ్డిపల్లి, బిల్వంపల్లి, చిగిచెర్ల ఎస్సీకాలనీ, గరుడంపల్లి, సుబ్బరావుపేట, నేటకోట గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. తాగునీటి కోసం సమీప వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. రాంపురం-ధర్మవరం, ముచ్చురామి-రేగాటిపల్లి, ధర్మవరం నుంచి తుమ్మల,తిప్పేపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. తాడిమర్రి నుంచి ఏకపాదంపల్లి, పుల్లప్పల్లి నుంచి పిన్నధరి, దాడితోట బైపాస్ నుంచి నాయనపల్లి, పార్నపల్లి నుంచి తురకవారిపల్లి గ్రామాల రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయి. చిల్లవారిపల్లి, చిల్లకొండయ్యపల్లి, శివంపల్లి బీసీకాలనీ తాగునీటి సమస్య ఉంది. చిల్లవారిపల్లి గ్రామంలో ప్రజలు బాటమ్మగుడి వద్దకు, వ్యవసాయ పొలాల వద్దకు తాగునీటి కోసం వెళుతున్నారు. చిల్లకొండయ్యపల్లిలో ఒక కిలోమీటరు దూరంలో ఉన్న మరోకాలనీకి వెళ్లి నీటిని తెచ్చుకుంటారు. ఈ ఏడాది చెరువులకు నీరు రాకపోవడంతో సాగునీటి కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముదిగుబ్బ మండల కేంద్రంలోని పాతవూరు తాగునీటి సమస్య అధికంగా ఉంది. దీంతో ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. నల్లాయగుంటపల్లి, యాకర్లకుంటపల్లి, గుంజేపల్లి, పొడరాళ్లపల్లి, సంకేపల్లి గ్రామాల సమీపంలో వ్యవసాయ బావులకు లో ఓల్టేజ్ సమస్య అధికంగా ఉంది.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

షేక్‌స్పియర్ (జయంతి)



ఆంగ్లభాషలో పేరొందిన నాటక రచయిత, కవి, నటుడు విలియం షేక్‌స్పియర్ 1564 ఏప్రిల్ 26న జన్మించారు. ఆయన నాటకాలు అన్ని ప్రముఖ భాషలలోకి అనువాదమై ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయి. తొలుత కామెడీలు, హిస్టరీలు రాసినా ఆ తర్వాత ఎక్కువగా ట్రాజెడీలు రాశారు. 39 నాటకాలు, 154 పద్యాలు, మూడు పొడవైన పోయెమ్స్ రాశారు. ఇంగ్లండ్‌లో నేషనల్ పోయెట్‌గా గుర్తింపు పొందారు. రోమియో అండ్ జూలియెట్, ఒథెల్లో, కింగ్ లియర్, మాక్‌బెత్ తదితర నాటకాలు నేటికీ ఆదరణ ఉన్నాయి. 1616 ఏప్రిల్ 23న కన్నుమూశారు.

శ్యామశాస్త్రి (జయంతి)



సంగీత త్రిమూర్తులలో మూడో వ్యక్తి శ్యామశాస్త్రి. కర్ణాటక సంగీత విద్వాంసులు, వాగ్గేయకారులు, అసలు పేరు వేంకట సుబ్రహ్మణ్యం. తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా తిరువారూరు గ్రామంలో 1763 ఏప్రిల్ 26న జన్మించారు. బంగారు కామాక్షి దేవి ఉపాసకులు కావడంతో అమ్మవారిపై తప్ప ఇతర రచనలు చేయలేదు. తెలుగు, సంస్కృతంలలో పండితులైన ఆయన కలగడ, మాంజి, చింతామణి తదితర అపూర్వ రాగాలను కల్పించారు. మధురై మీనాక్షిదేవిని స్తుతిస్తూ తొమ్మిది కృతులు పాడగా అవి 'నవరత్నమాలికా' గా పేరొందాయి. ఆనందభైరవి రాగంలో ఎక్కువ కృతులు రాశారు. 1827 ఫిబ్రవరి 6న పరమపదించారు.

కేఎన్ కేసరి (జయంతి)



కేఎన్ కేసరిగా పేరొందిన కోట నరసింహం 1875 ఏప్రిల్ 26న ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం ఇనమనమెళ్ళూరు గ్రామంలో జన్మించారు. 11వ యేట కాలినడకన మద్రాసు చేరి అక్కడ చదువుకున్నారు. 1900లో మద్రాసులో ఒక చిన్న బాడుగ ఇంట్లో 'కేసరి కుటీరం' పేరుతో మందులతయారీ సంస్థను ప్రారంభించారు. 1928లో స్త్రీ జనోద్ధరణకు గృహలక్ష్మి మాసపత్రికను స్థాపించారు. మైలాపూర్ తెలుగు ప్రాథమిక పాఠశాలను ఉన్నతపాఠశాల స్థాయికి చేర్చారు. 'చిన్ననాటి ముచ్చట్లు' పేరుతో ఆయన జీవిత విశేషాలను పుస్తకంగా రాశారు. సినీ గాయకుడైన ఉన్ని కృష్ణన్ ఆయన మునిమనుమడు. దానశీలిగా పేరొందిన కేసరి 1958 జూన్ 8న కన్నుమూశారు.

విద్వాన్ వీణ వెంకట గిరియప్ప (జయంతి)



వీణ వెంకట గిరియప్ప 1887 ఏప్రిల్ 26న కర్ణాటక రాష్ట్రం మైసూరు జిల్లా హెగ్గడ దేవన కోటెలో జన్మించారు. సంగీతకారుడిగానే కాక సంగీతం ఉపాధ్యాయులుగాను రాణించారు. మైసూరు మహారాజ ఆస్థాన విద్వాంసుడిగా వ్యవహరించారు. యువరాజు కంఠీరవ నరసింహరాజ ఒడయార్ కుమార్తెకు సంగీతం పాఠాలు బోధించారు. ప్యాలెస్ బ్యాండ్‌కు డైరెక్టర్‌గా వ్యవహరించారు. మహారాజు నేతృత్వంలో పాశ్చాత్యశైలిలో క్లాజికల్ మ్యూజిక్ ఆర్కెస్ట్రా నిర్వహించిన ఘనత ఆయనది. ప్రభుత్వ ట్రైనింగ్ కళాశాల, మహారాణి హైస్కూల్‌లోనూ వీణ పాఠాలు బోధించారు. 1951లో కన్నుమూశారు.

శ్రీనివాస రామానుజన్ (వర్ధంతి)



గణిత శాస్త్రవేత్తగా పేరొందిన శ్రీనివాస రామానుజన్ 1887 డిసెంబరు 22న తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లో జన్మించారు. ఎటువంటి తర్ఫీదు లేకుండానే ప్యూర్ మ్యాథమ్యాటిక్స్‌లో సత్తా చాటారు. మ్యాథమ్యాటికల్ అనాలిసిస్, నెంబర్ థియరీ, ఇన్ఫినిట్ సిరీస్, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్ అంశాలలో తనదైన శైలిలో జవాబులు సృష్టించారు. అనేక ఫార్ములాలకు రూపకల్పన చేశారు. గణితంలో నేటికీ ఆయన స్ఫూర్తిగా నిలిచారు. 'ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ' అవార్డు పొందారు. 32వ యేటనే 1920 ఏప్రిల్ 26న కన్నుమూశారు.

244 పోలింగ్ కేంద్రాలు .. 2వేలమంది సిబ్బంది



మీడియా సమావేశంలో తాలూకా ఎన్నికల అధికారి జావీదా నసీమా ఖానం తదితరులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి శిడ్లఘట్ట పరిధిలో 244 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఎన్నికల విధులకోసం సుమారు 2వేలమంది సిబ్బంది కేటాయించబడ్డారని తాలూకా ఎన్నికల అధికారి జావీదా నసీమా ఖానం వెల్లడించారు. గురువారం తాలూకా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ శిడ్లఘట్ట పరిధిలో 1,02,327 మంది పురుషులు, 1,03,453మంది మహిళలు, ఇతరులు 9మంది కలిపి 2,05,789మంది ఓటర్లు, 23మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారన్నారు. 85ఏళ్ల పైబడినవారికి, దివ్యాంగులకు ఇంటివద్దనే ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. 486మందికిగాను 466మంది ఓటు వేశారన్నారు. 54 సున్నిత పోలింగ్ కేంద్రాలు ఉండగా గంగనహళ్లి, ఆనేమడగు, ప్రభుత్వ హైస్కూల్ కోటె, ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల శిడ్లఘట్ట నందనవన, సొణగానహళ్ళిలో 6 వీక్ పోలింగ్ స్టేషన్‌లు ఉన్నాయన్నారు. 128 చోట్ల వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేశామన్నారు. 6 వీక్ పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో తాము పోలీసులతో కలసి ప్రజలలో ఆత్మస్థైర్యం నింపామని, ఓటు హక్కు ఆవశ్యకతను వివరించామన్నారు. పట్టణ, గ్రామీణ ప్రదేశాలలోని పోలింగ్ బూత్‌లలో ఎండవేడిమినుంచి ఉపశమనం పొందేలా నీడ కల్పించామని, తాగునీటి వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. దివ్యాంగులకు వీల్‌చెయిర్ సదుపాయం ఉందన్నారు. సమస్య ఏదైనా ఉంటే హెల్ప్‌డెస్క్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. పోలింగ్‌వేళ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రతలకోసం భారీగా పోలీసు బలగాలు మొహరించారన్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా సిబ్బందికి బస్సు వ్యవస్థ కల్పించామన్నారు. తాలూకా స్వీప్ సమితి అధ్యక్షుడు మునిరాజు నేతృత్వంలో అన్ని చోట్లా ఓటు హక్కుపై జాగృతి కార్యక్రమాలు సాగాయన్నారు. 26న శుక్రవారం ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. తహసీల్దార్ బీఎన్ స్వామి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీసం 7మంది సిబ్బంది విధులలో ఉంటారన్నారు. పోలింగ్ కేంద్రం లోపల మొబైల్‌ను అనుమతించరన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే సెక్టర్ అధికారులు, పోలీసు సిబ్బందికి సూచనలు చేశామన్నారు. చెక్‌పోస్ట్‌లలో ఇప్పటివరకు ఎటువంటి నగదు తరలిపు కేసులు నమోదు కాలేదన్నారు. మీడియా సమావేశంలో తాలూకా స్వీప్ సమితి అధ్యక్షుడైన తాలూకా పంచాయతీ కార్యనిర్వాహక అధికారి జీ మునిరాజు, నగరసభ కమిషనర్ గోపాల్‌జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌తో కలసి జోడోయాత్ర చేసిన

సుశ్రుత్‌గౌడ బీజేపీలో చేరిక

బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రలో కన్యాకుమారి నుంచి కశ్మీర్‌దాకా నడిచిన డాక్టర్ సుశ్రుత్‌గౌడ బీజేపీలో చేరారు. ఇటీవలే సుశ్రుత్‌ను కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగాను నియమించారు. జోడోయాత్ర ఆరంభం నుంచి చివరిదాకా పాదయాత్ర చేయడం ద్వారా జాతీయస్థాయిలో సుశ్రుత్‌గౌడ పేరొందారు. రాహుల్‌తోనే కలసి ఉంటారని, కాంగ్రెస్ కోసం పనిచేస్తారని భావించారు. అయితే లోక్‌సభ ఎన్నికల వేళ బుధవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సుశ్రుత్‌గౌడ మాట్లాడుతూ బీజేపీలో నైతిక విలువలు కలిగినవారు ఉన్నారని ఇదే తగిన వేదిక అని భావిస్తున్నానన్నారు. సమాజానికి కట్టుబడేవారు ఇక్కడ ఉన్నారన్నారు. కాంగ్రెస్ కుటిల తంత్రాలతో సమాజాన్ని కులాలవారీగా విభజిస్తోందని మండిపడ్డారు. సుశ్రుత్‌గౌడ పార్టీ ఫిరాయింపుతో కాంగ్రెస్‌కు షాక్ ఇచ్చినట్టయ్యింది.



సుశ్రుత్‌గౌడను స్వాగతిస్తున్న బీజేపీ నాయకులు

ఓటుపై చైతన్యం కల్పించాం



మీడియాతో కుందలగుర్కి మునీంద్ర తదితరులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 25: దళితులు, మైనారిటీలు, వెనుకబడినవర్గాల్లో రాజ్యాంగంపై అవగాహన కల్పించామని తద్వారా ఓటు ఆవశ్యకతను వివరించామని రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మానవ బంధుత్వ వేదిక జిల్లా సంచాలకులు కుందలగుర్కి మునీంద్ర అభిప్రాయపడ్డారు. పట్టణంలోని డాల్ఫిన్ విద్యాసంస్థలో గురువారం శోషితవర్గాల ప్రముఖులతో కలసి మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత ఎన్నికలు అబద్ధం, సత్యంకు మధ్య జరగుతున్నాయన్నారు. ప్రధాని మోదీ ప్రజలను, యువతను దారి తప్పించారన్నారు. యువతకు ఉద్యోగాలు లేవన్నారు. రాజ్యాంగం చదవడం కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడం అనేది తమ నినాదంగా ఉందన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ఇందుకుగాను దళితులు, మైనారిటీలు, వెనుకబడిన వర్గాలు సమైక్యంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు డాల్ఫి నాగరాజ్ మాట్లాడుతూ దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. జీవక తాలూకా సంచాలకులు శ్రీనివాస్ చక్రవర్తి మాట్లాడుతూ కేంద్రంలో యూపీఏ హయాంలో 55లక్షలకోట్లు అప్పు ఉండగా గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం రూ.115 లక్షలకోట్లు చేసిందని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తాలూకా దళిత సంఘర్ష సంచాలకులు టీపీ చలపతి, ముఖ్యులు నాగనరసింహ, నాగరాజు, నారాయణస్వామి, యాదవ్, ముఖ్యులు మంజునాథ్, కురుబ సంఘం రామణ్ణ, మునాజినప్ప, గాణిగ సముదాయ ముఖ్యులు జేఎం బాలకృష్ణ, వాల్మీకి సముదాయం అణ్ణప్ప, దేవరాజ్, మంజునాథ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లి పరిధిలో 267 పోలింగ్ కేంద్రాలు

» సామగ్రితో తరలిన సిబ్బంది

బాగేపల్లి, ఏప్రిల్ 25: చిక్కబళ్ళాపుర లోక్‌సభ పరిధిలోని బాగేపల్లి శాసనసభ నియోజకవర్గంలో 267 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రశాంత పోలింగ్‌కు ప్రజలు సహకరించాలని జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ బాగేపల్లి పట్టణంలోని నేషనల్ కళాశాలలోని లోక్‌సభ ఎన్నికల కేంద్రంలోని ఈవీఎంలను పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన మస్టరింగ్, డీ మస్టరింగ్, రవాణా, భోజన ఇతర వ్యవస్థలపై చర్చించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ఓటర్లకు అవసరమైన సదుపాయాలు కల్పించామన్నారు. జిల్లాలోని ఇతర తాలూకాలైన గౌరిబిదనూరు, చింతామణి, చిక్కబళ్ళాపుర, శిడ్లఘట్టలనుంచి వచ్చే సిబ్బందికి బస్సు, అల్పాహార, భోజన వ్యవస్థ కల్పించినట్టు తెలిపారు. 20 సెక్టార్ అధికారులు, పోలీస్ సిబ్బందిని విధులకు కేటాయించినట్టు తెలిపారు. ఎన్నికల సిబ్బందికి 85 బస్సులను కల్పించామన్నారు. 95 పోలింగ్ కేంద్రాల వద్ద ఎండ వేడిమినుంచి ఉపశమనం పొందేలా షామియానా వ్యవస్థ చేశామన్నారు. తాలూకాలోని 21 సూక్ష్మ, అతి సూక్ష్మ కేంద్రాలకు అధిక భద్రత కోసం సాయుధబలగాలను కేటాయించామన్నారు. తహసీల్దారు ప్రశాంత్ కే పాటిల్ మాట్లాడుతూ బాగేపల్లి శాసనసభ నియోజకవర్గ పరిధిలో 2,16,682 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఉదయం 7 గంటలనుంచి సాయంత్రం 6వరకు పోలింగ్ ఉంటుందని ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా వందశాతం పోలింగ్‌కు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా సహాయక ఎన్నికల అధికారి సంతోష్‌కుమార్ పాటిల్, జిల్లా పంచాయతీ సీఈఓ ప్రకాశ్ నిట్టాలి, తహసీల్దార్ మనీషాపత్రి, తాలూకా పంచాయతీ ఈఓ హేమావతి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ధి తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంలతో తరలుతున్న సిబ్బంది

తాలూకాలో 271 పోలింగ్ కేంద్రాలు

- ఈవీఎంలతో తరలిన సిబ్బంది

చింతామణి, ఏప్రిల్ 25: కోలారు రిజర్వు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని చింతామణి శాసనసభ నియోజకవర్గంలో 271 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో సిబ్బంది తరలారు. చింతామణి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో గురువారం ఎన్నికల సహాయ అధికారి, తహసీల్దార్ సుదర్శన్ యాదవ్ నేతృత్వంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సిబ్బందికి ఎన్నికల సామగ్రి కేటాయించారు. వివిధ తాలూకాలనుంచి వచ్చిన సిబ్బందికి తొలుత ఈవీఎంల పనితీరును పరిశీలించారు. శాసనసభ నియోజకవర్గ పరిధిలో 2,28,299 లక్షలమంది ఓటర్లు ఉండగా 1,12,221 మంది పురుషులు, 1,16,039మంది మహిళలు, 39మంది ఇతరులు ఉన్నారు. 271 పోలింగ్ కేంద్రాల పైకి 65 అతి సూక్ష్మ, 9 సూక్ష్మ కేంద్రాలుగా గుర్తించారు. ఎన్నికల విధులకు 1381మందిని కేటాయించారు. పాలిటెక్నిక్ కళాశాలలో సందడి నెలకొంది.



పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్నికల విధులకు బయల్దేరుతున్న పోలీసులు



ఎన్నికల సామగ్రితో బస్సు ఎక్కుతున్న సిబ్బంది

శ్యామ్ పిట్రోడా వ్యాఖ్యలతో కాంగ్రెస్‌కు సంబంధం లేదు

» ఎవరేమైనా మాట్లాడనీ నేను లంచం తీసుకోలేదు - డీకే శివకుమార్

బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శ్యామ్ పిట్రోడా వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదని, డెత్ ట్యాక్స్ ఉండదని, బర్త్ ట్యాక్స్ ఉండదని డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. గురువారం ఆయన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ పిత్రార్జిత ఆస్తిలో 55శాతం ప్రభుత్వం పొందాలనే ఆయన వ్యాఖ్యలు పార్టీకి సంబంధం లేనివన్నారు. ఇది భారతదేశమని, ఏదో దేశంలో ఉందని ఇక్కడ పోల్చడం సరికాదన్నారు. పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పష్టత ఇచ్చారన్నారు. ఈ దేశ పరంపర కొనసాగనుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఓటమి భయంతో దేశవ్యాప్తంగా అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. ప్రధాని మోదీ బాధ్యతలు చేపట్టినప్పుడు గ్రాము బంగారం రూ.2,800 ఉండేదని, ప్రస్తుతం రూ.7,500 ఉందన్నారు. మహిళలు మంగళసూత్రం వేసుకునేందుకు సాధ్యం కానంతగా బంగారం ధర పెంచింది బీజేపీ వారేనన్నారు. ప్రియాంకగాంధీ బెంగళూరు సభలో నా తల్లి దేశం కోసం మాంగల్యాన్ని కోల్పోయిందన్నారు. ప్రజలు ఎవరేం మాట్లాడుకున్నా సంబంధం లేదని, నేను ఎవరితోనూ ఒక రూపాయి లంచం తీసుకోలేదన్నారు. ఐదేళ్లకోసారి దేవేగౌడ, కుమారస్వామిలు కనకపురకు వస్తారని ఎద్దేవా చేశారు.

జేఈఈ మెయిన్‌లో 'అలెన్' సాయి నవనీత్‌కు 41వ ర్యాంకు



సాయి నవనీత్ ముకుంద్

బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్‌లో అలెన్ బెంగళూరు విద్యార్థి సాయి నవనీత్ ముకుంద్‌కు 41వ ర్యాంకు వచ్చింది. కర్ణాటకలో టాపర్‌గా నవనీత్ నిలిచారు. గురువారం జేఈఈ మెయిన్ ఫలితాలు ప్రకటించగా అలెన్ విద్యార్థులకు జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు వచ్చినట్టు సౌత్ ఇండియా హెడ్ మహేశ్‌యాదవ్ తెలిపారు. వందలోపు ర్యాంకుల్లో శ్యామ్ థామస్, బాల కుమారన్ ఉన్నారన్నారు. 500లోపు ర్యాంకుల్లో 16మంది, వెయ్యిలోపు ర్యాంకులో 35మంది, 2వేలలోపు ర్యాంకులో 80మంది, 5వేలలోపు ర్యాంకులలో 176మంది ఉన్నారన్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1867మంది క్వాలిఫై అయినట్టు మహేశ్‌యాదవ్ తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

27న శ్యామశాస్త్రికి సంగీత నివాళి

బెంగళూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సంగీత మాంత్రికుడు శ్యామశాస్త్రికి గౌరవం సమర్పించేందుకు నటనం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డ్యాన్స్ ఆధ్వర్యంలో సంగీత నివాళి కార్యక్రమం నిర్వహించనున్నారు. జయనగర్‌లోని ఇన్‌స్టిట్యూట్‌లో ఈనెల 27న శనివారం రక్షా కార్తీక్ శిష్యబృందం ఆధ్వర్యంలో సంగీత కార్య క్రమం కొనసాగనుంది. ముఖ్యులుగా బెంగళూరు ఐఐటీ ఫౌండర్ డైరెక్టర్ శడగోపన్ భాగస్వామ్యులు కానున్నారు. విద్వాన్ ఆనూరు అనంతకృష్ణశర్మ, సంగీత కళారత్న డాక్టర్ ఎస్ సూర్యప్రసాద్‌తోపాటు పలువురు పాల్గొననున్నారు.

నేడు వారపుసంతకు సెలవు

విజయపుర, ఏప్రిల్ 25: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పట్టణంలో 26న శుక్రవారం నిర్వహించే వారపుసంత, పట్టుగూళ్ల మార్కెట్‌కు సెలవు ప్రకటిస్తున్నట్టు జిల్లా అధికారి వెల్లడించారు. ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్టు పేర్కొన్నారు.

పోలింగ్ రోజు ఏజెంట్లే కీలకం

ముదిగుబ్బ, ఏప్రిల్ 25: ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రాల్లో అభ్యర్థుల తరపున పరిశీలనకు కూర్చునే ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకం. అభ్యర్థులు నెలల తరబడి నిర్వహించిన ప్రచారం, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడిన కష్టానికి ఫలితం ఇచ్చేది పోలింగ్ కేంద్రమే. అటువంటి కేంద్రంలో పోలింగ్ సక్రమంగా జరుగుతుందా? లేదా అన్నది గమనించడం, బోగస్ ఓట్లు పడకుండా ఓటు వేయడానికి వచ్చినవారిని నిశితంగా పరిశీలించడం ఏజెంట్ల పని. గుర్తింపు పొందిన, రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల తరపున ప్రాధాన్య క్రమంలో ఏజెంట్లు పోలింగ్ కేంద్రాల్లో కూర్చుంటారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలిక ఏజెంట్ నిశితంగా పరిశీలించాలి. ఏమాత్రం అనుమానం వచ్చిన ఏజెంట్ తన అభ్యంతరాన్ని ప్రీసైడింగ్ అధికారికి తెలపవచ్చు. ఎంతో కీలకమైన ఈ ఏజెంట్‌గా అభ్యర్థులు తమకు నమ్మకమైనవారిని కూర్చోబెడతారు. ఏజెంట్ ఏమాత్రం తప్పు చేసినా ఆ పార్టీ అభ్యర్థికి నష్టమే కలుగుతుంది.

టీడీపీ వస్తేనే.. రూ.5 భోజనం



నిరుపయోగంగా ఉన్న అన్న క్యాంటిన్

మడకశిరటౌన్, ఏప్రిల్ 25: స్థానిక అమరాపురం రోడ్డులో ఉన్న అన్న క్యాంటిన్ నిరుపయోగంగా మారింది. టీడీపీ పాలనలో ఎంతోమంది ఆకలి తీర్చిన ఈ క్యాంటిన్ వైసీపీ ప్రభుత్వ తీరుతో మూతపడింది. తహసీల్దార్ కార్యాలయం, రిజిస్ట్రేషన్‌ల కోసం, కోర్టు పనులు ఇతరత్ర వ్యవహారాల మీద ఎంతో మంది ఐదు మండలాల నుంచి మడకశిరకు వచ్చేవారు. వారిలో చాలా మంది మధ్యాహ్నం వేళ అన్న క్యాంటిన్‌లోనే భోజనం చేసేవారు. కేవలం రూ.5లకే రుచికరమైన భోజనం లభిస్తుండటంతో గ్రామంలోని పేదలు సైతం ఇక్కడే తినేవారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు అన్నా క్యాంటిన్ ఎంతో మంది పేదల ఆకలి తీర్చింది. రాష్ట్రంలో అధికారం మారడంతో అన్న క్యాంటిన్‌లు మూతపడ్డాయి. దీనిపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. టీడీపీ అధికారంలోకి వస్తేనే మళ్లీ అన్న క్యాంటిన్ వస్తాయని ప్రజలు అంటున్నారు.

పార్టీ ఏదైనా ప్రచారానికి ఓకే..!




ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి మందుబాబుల్లో సందడి నెలకొంది. ప్రతి రోజూ వారికి పండుగే. మద్యం అందిస్తే చాలు.. పార్టీతో పని లేదు. ఏ పార్టీకైనా ప్రచారం చేసేస్తున్నారు. వారే ముందుడి ప్రచారాన్ని తీసుకెళ్తున్నారు. రోజుకోపార్టీకి ప్రచారం చేస్తున్నారు, మరికొంత మంది మందు బాబులు ఉదయం ఓపార్టీతో సాయంత్రం మరోపార్టీతో కలిసిపోతున్నారు. మద్యం పుష్కలంగా ఉచితంగా దొరుకుతుండటంతో మందుబాబులకు కిక్కు దిగడం లేదు. ఉచితంగా మద్యం దొరుకుతుండటంతో అలవాటు లేనివారు సైతం మందు తాగేందుకు మొగ్గు చూపుతున్నారు. **- మడకశిర రూరల్**

చెక్‌పోస్టు పడింది



గౌడనహళ్లి గ్రామ సమీపంలో మూతపడిన చెక్‌పోస్టు

మడకశిర రూరల్ ఏప్రిల్ 25: వైసీపీ పాలనలో సరిహద్దుల్లో మద్యం అక్రమ రవాణాకు గేట్లు ఎత్తేశారనే విమర్శలు వినవస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజుల్లో మద్యం, ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల్లో తనిఖీలు చేయడంకోసం చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. మండలంలోని సరిహద్దు గ్రామాల్లో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, వాటికి విద్యుత్ సౌకర్యం కల్పించారు. సీసీ కెమేరాలు కూడా ఏర్పాటు చేశారు. నిధుల కొరతతో ఏడాది తిరగకమునుపే చెక్‌పోస్టులు ఎత్తివేశారు. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. ప్రస్తుతం ఎన్నిల సమయం కావడంతో కర్ణాటక నుంచి వివిధ మార్గాల్లో మద్యం అక్రమంగా ఆంధ్రలోకి జోరుగా రవాణా అవుతోంది. దీంతో గ్రామాల్లో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. కాగా కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై గట్టి చర్యలు తీసుకోనున్నట్లు సెబ్ సీఐ ధీరజ్‌రెడ్డి తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,578.44	1,576.29
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	67	252
సామర్థ్యం (టీఎంసీలు)	3.76	2.93

రోడ్డుప్రమాదంలో గాయపడిన చిరుత



రోడ్డుమీద పడివున్న గాయపడిన చిరుత

కంప్లి, ఏప్రిల్ 25 : విజయనగర జిల్లా మైలార్ - తోరణగల్లు ఎస్‌హెచ్ రోడ్డులో మంగళ వారం రాత్రి రోడ్డు దాటుతున్న చిరుతను గుర్తుతెలియని వాహనం ఢీకొనింది దీంతో చిరుతకు తీవ్ర గాయాలయ్యాయి. ఉదయమే ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని చిరుతకు చికిత్స అందించారు. వాహనం ఢీకొనడంతో తలకు, కాళ్లకు బలమైన గాయాలైనట్లు తెలిపారు. కాగా రాత్రివేళల్లో అటవీ ప్రాంతాల్లో రోడ్డు దాటే సమయంలో వేగంగా వస్తున్న వాహనాలు మూగజీవులను లెక్కచేయకుండా ఢీకొని వెళుతుండటంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. మూగజీవులు సంచరించే ప్రాంతాల్లో బోర్డులను, నామఫలకాలను ఏర్పాటు చేస్తే కొంతవరకు వాటిని రక్షించిన వారవుతారని ప్రజలు అంటున్నారు.

పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యం



మలేరియా నివారణ దినోత్సవం జరుపుతున్న దృశ్యం

కంప్లి, ఏప్రిల్ 25 : గ్రామాలలో తమ చుట్టూ వుండే ప్రాంతాలను, పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకుని తమ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని ఆరోగ్యశాఖ అధికారులు బసవరాజు కోరారు. మలేరియా దినోత్సవం సందర్భంగా కంప్లి పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్ర కనికేరి మాట్లాడుతూ చిన్నపాటి జబ్బులు సోకినా నిర్లక్ష్యం వహించకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వాస్పత్రి సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వీరేష్, శ్రీనివాస్, గవిరాజ్, జగన్నాథ్ హిరేమఠ్, బసవరాజు, శోభ, లక్ష్మీ, మాంతేష్, చెన్న బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాములు కోసం దీప విస్తృత ప్రచారం



ఉపాధి కూలీల వద్ద ప్రచారం చేపడుతున్న దీప

కంప్లి, ఏప్రిల్ 25 : బీజేపీ అభ్యర్థి శ్రీరాములు గెలుపు కోసం మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు భార్య దీప నియోజకవర్గంలో విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. మదిరి గ్రామ పంచాయతీలో ఉపాధి కూలీలతో శ్రీరాములు గెలుపు కోసం బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం చేపట్టారు. ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన ఓటును కమలం గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. కేవలం బీజేపీ వల్లే అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితమన్నారు. అలాగే నరేంద్ర మోడీ గ్రామాల్లో ప్రజలకు, రైతులకు ఎన్నో సదుపాయాలు కల్పించారన్నారు. మరోసారి బీజేపీకి అవకాశం కల్పిస్తే పూర్తిగా గ్రామాలు అభివృద్ధి బాటలో కొనసాగుతాయని తెలిపారు.

ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించండి

కంప్లి, ఏప్రిల్ 25 : రైతులు కష్టపడి పండించిన ఉల్లి పంటకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలు కల్పించాలని రాష్ట్ర రైతు సంఘం కార్యాధ్యక్షులు వీరసంగయ్య డిమాండ్ చేశారు. అడగళిలో పునిత్ రాజ్‌కుమార్ సర్కిల్‌లో ఉల్లి పంటను రోడ్డుపై వేసి ప్రతి ఘటన చేపట్టారు. వేసవిలో విద్యుత్ సమస్య, నీటి సమస్యను ఎదుర్కొని పంటలు పండించిన రైతుకు ప్రభుత్వం కనీస ధరలు కల్పించడంలో విఫలమవుతోందన్నారు.

కొప్పళ బరిలో 19మంది

● 2009 రికార్డును తిరగరాసిన ప్రస్తుత ఎన్నికలు

● ప్రతి పోలింగ్ కేంద్రానికి రెండు పోలింగ్ యంత్రాలు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 25: రాష్ట్రంలో రెండవ విడత లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న స్థానాల్లో ఇప్పటికే నామినేషన్‌ల ఉపసంహరణ ఘట్టం ముగిసింది. కదనంలో నిలిచింది ఎంతమంది.. ఎవరనే విషయం తేటతెల్లమైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం సమాచారం మేరకు కొప్పళలో 1952 నుంచి 2018వరకు 17 లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం మొదటి సారిగా కొప్పళ లోక్‌సభ నియోజకవర్గం ఎన్నికల బరిలో 19మంది అభ్యర్థులు పోటీచేస్తున్నారు. దీంతో పాతరికార్డును తిరిగి రాసినట్లు అయింది. ఇప్పటి వరకు 2009లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 18మంది పోటీ నిలవగా, 2019లో జరిగిన ఎన్నికల్లో 14 మంది పోటీ చేశారు. 1952-1971 వరకు మొదట ఐదు ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు మాత్రమే ఎన్నికల్లో నిలిచారు. 1977లో సిద్ధరామేశ్వర స్వామి, సంగణ్ణ అగడి, కె.ఆర్.తిప్పణ్ణలు పోటీ చేశారు. తిరిగి 1980లో హెచ్.జి.రాములు, హెచ్.ఆర్.బసవరాజు జాతీయ పార్టీల నుంచి పోటీ చేశారు. 1984లో 11మంది అభ్యర్థులు పోటీచేయగా, 1989లో కేవలం ముగ్గురు 1991లో 14మంది, 1996లో 12మంది అభ్యర్థులు, 1999లో ముగ్గురు, 2004లో ఆరుగురు అభ్యర్థులు పోటీ చేశారు. 2009లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 18మంది అభ్యర్థులు పోటీ చేసి అప్పట్లో రికార్డు సృష్టించారు. అనంతరం ఈ సారి కొప్పళ లోక్‌సభ నియోజకవర్గానికి ఏకంగా 19మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, నోటా ఓటుతో పాటు మొత్తం 20 వరసలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

అందుచేత ఎన్నికలు నిర్వహణకు వెళ్ళే సిబ్బంది ఈ సారి రెండుపోలింగ్ యంత్రాలను తీసుకెళ్లాల్సి వస్తోంది. ఒక పోలింగ్ యంత్రంలో 16మంది అభ్యర్థుల పేర్లు ఏర్పాటు చేయవచ్చు. అయితే కొప్పళ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో 19మంది పోటీ చేస్తున్న కారణంగా రెండు పోలింగ్ యంత్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.



ఎన్నికల సమయంలో పోలింగ్ యంత్రాలను ఎంత కరెక్టుగా నిర్వహించినా, అక్కడక్క పోలింగ్ యంత్రాలు మొరాయించడం మామూలే. ఎన్నికలు జరిగిన ప్రతి సారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటూ ఉంటాయి. ఇలాంటి సమయంలో ఒక పోలింగ్ యంత్రాన్ని నిర్వహించడమే పెద్ద సవాలుగా మారిన ఈ తరుణంలో కొప్పళ లోక్‌సభ ఎన్నికల్లో రెండు పోలింగ్ యంత్రాలను మండుటెండల్లో పోలింగ్ కేంద్రానికి అధికారులు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడం అగ్నిపరీక్ష అంటూ పోలింగ్ నిర్వహణకు కేటాయించిన అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బళ్లారి అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

బళ్లారి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మే 7 న జరిగే లోకసభ ఎన్నికలలో పోటీచేస్తున్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించినట్లు ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బి-ఫారం దాఖలు చేసిన ఈ. తుకారాంకు హస్తం గుర్తు, బీజేపీ నుంచి పోటీలో నిలిచిన బి. శ్రీరాములుకు కమలం గుర్తు కేటాయించామన్నారు. కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి సి. చన్నవీర కు బ్యాటరీ టార్చ్ గుర్తు, సోషలిస్ట్ యూనిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ అభ్యర్థి దేవదాస్‌కు ఆటో రిక్షా, ప్రహార్ జనశక్తి పార్టీ అభ్యర్థి మంజునాథ్ గోపాలకు చెరకు రైతు, నవభారత్ సేన పార్టీ అభ్యర్థి జి స్వామికి కాపు గుర్తు కేటాయించారు. ఇండిపెండెంట్ అభ్యర్థి అయిన అరుణ్ ఎస్, హిరేహాళ్ కు ల్యాప్‌టాప్ గుర్తు, కండక్టర్ పంపాపతికి విజిల్, వీరేష్‌కు ప్రెషర్ కుక్కరు గుర్తును కేటాయించామని ఎన్నికల అధికారి తెలిపారు.

నేడు రాహుల్ సభ కోసం సిద్ధమైన మున్సిపల్ మైదానం



మున్సిపల్ మైదానంలో ట్యాంకర్లతో నీటిని చల్లుతున్న దృశ్యం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 25 : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బళ్లారి నగరంలో శుక్రవారం రాహుల్ గాంధీ పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మునిసిపల్ మైదానంలో బహిరంగ సభ ఏర్పాట్లను బళ్లారి ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అల్లం ప్రశాంత్, బుడా అధ్యక్షులు ఆంజనేయులు పరిశీలించారు. సాయంత్రం 4 గంటల నుంచి జరగబోయే బహిరంగ సభ ఏర్పాట్లను పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. సభాప్రాంగణంలో టాంకర్లతో నీటిని చల్లిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

వైభవంగా శాంతేశ్వరస్వామి రథోత్సవం



అరసికెర గ్రామంలో సాగుతున్న శాంతేశ్వరస్వామి రథోత్సవం

కంప్లి, ఏప్రిల్ 25 : హరప్పనహళ్లి తాలుకా అరిసికెర గ్రామంలో శాంతేశ్వరస్వామికి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజా కార్యక్రమాలు జరిగాయి. హరప్పనహళ్లి తాలుకా పరిధిలోని గ్రామాలలోని భక్తాదులు భారీ ఎత్తున తరలివచ్చారు. పూలు, పండ్లతో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి యేడాది ఈ రథోత్సవాన్ని వైభవంగా జరుపుకుంటామని గ్రామస్తులు తెలిపారు.

బుడా కార్యాలయంపై లోకాయుక్త వల

● లంచం తీసుకుంటూ లోకాయుక్త అధికారులకు దొరికిన కమిషనర్, ఆరుగురు సిబ్బంది

బళ్లారి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బళ్లారి డెవలప్‌మెంట్ అథారిటీ(బుడా) కార్యాలయం పై లోకాయుక్త వల విసిరింది. ఒక రియల్ ఎస్టేటర్ లంచం తీసుకుంటుండగా బుడా కమీషనర్ సహా ఆరుగురు సిబ్బందిని లోకాయుక్త అధికారులు అదుపులోకి తీసుకున్నారు. లోకాయుక్త ఎస్పీ సిద్ధరాజు తెలిపిన వివరాల ప్రకారం, బళ్లారిలో రియల్ ఎస్టేటర్ అయిన వీరేష్ తన 20 ఎకరాల స్థలంలో డెవలప్‌మెంట్ కోసం బుడా అనుమతి కోరారు. ఇందుకు బుడా కమీషనర్ రమేష్ వటగల్, మరో ఆరుగురు సిబ్బంది కూడా విడివిడిగా లంచం ఇవ్వాలని కోరారు. దీంతో రియల్ ఎస్టేటర్ వీరేష్ లోకాయుక్తను ఆశ్రయించారు. బుడాలో జరుగుతున్న తంతుపై ఫిర్యాదు చేశారు. దీంతో లోకాయుక్త రంగంలోకి దిగింది. బుడా కమీషనర్ రూ. 5 లక్షలు లంచం తీసుకుంటుండగా లోకాయుక్త రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుంది. అంతేకాకుండా బుడాలో వివిద డిపార్టుమెంట్లలో ఉండే సిబ్బంది వారి అనుమతులు ఇవ్వడానికి రూ లక్షల్లో డిమాండ్ చేసినట్లు వీరేష్ లోకాయుక్త అధికారులకు ఫిర్యాదు చేశారు. నగర ప్రణాళిక విభాగం సభ్యుడు కల్లినాథ్, 6 లక్షలు, అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారి రూ. 3 లక్షలు, మేనేజర్ నారాయణ రూ. 60 వేలు, వర్కర్ శంకర్, రూ. 20 వేలు, లంచం డిమాండ్ చేసినట్లు వీరేష్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఇందులో కొందరికి ఫోన్ పే ద్వారా కూడా లంచం వేసినట్లు తెలిపారు. బుడా కమీషనర్‌తో పాటు లంచం తీసుకున్న కల్లినాత్, యశస్విన్, నారాయణ, శంకర్ ఇలా మొత్తం ఆరుగురు సిబ్బందిని కూడా లోకాయుక్త అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.



ప్రచారం చేస్తున్న మంత్రి నాగేంద్ర



వన్నళ్లి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి కోసం ప్రచారం చేస్తున్న మంత్రి నాగేంద్ర

బళ్లారిరూరల్, ఏప్రిల్ 25 : బళ్లారి తాలుకాలో వన్నళ్లి గ్రామంతో పాటు పలు గ్రామాల్లో మంత్రి నాగేంద్ర ప్రచారం చేపట్టారు. లోక్‌సభ అభ్యర్థి తుకారామ్‌కు ఓటు వేయాలని కోరారు. అనంతరం మహిళలకు ప్రభుత్వం ఐదు గ్యారెంటీలను అమలు చేయడం వల్ల అనుకూలంగా వుంటూ కుటుంబాన్ని పోషించుకోవచ్చునని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అసోంది వన్నూరప్ప, సునిల్, విజయ్‌కుమార్, హగరి గోవిందు, ముద్దమల్లయ్య, గాదెలింగనగౌడ, పలు గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భరత్ రెడ్డి ప్రచారం



బళ్లారిరూరల్, ఏప్రిల్ 25 : బళ్లారి నగరం పలు వార్డులలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపుకోసం పెద్దఎత్తున ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో ఆయన మాట్లాడుతూ నగర ఓటర్లు తమ పవిత్రమైన ఓటును కాంగ్రెస్ హస్తం గుర్తుకు వేయాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు సంక్షేమ పథకాల వలన ప్రజలకు ఎంతో లబ్ది చేకూరిందని, ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బీఆర్ఎల్ శీన, ముల్లంగి నందీష్, బోయపాటి విష్ణువర్ధన్, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాయచూరులో వేడెక్కుతున్న ఎన్నికల ప్రచారం

● బరిలో 8 మంది అభ్యర్థులు ● 20.10 లక్షలకు చేరిన ఓటర్లు ● నరేంద్ర మోదీ సభ వాయిదా

రాయచూరు, ఏప్రిల్ 25 : నామినేషన్‌ల ఉపసంహరణ ఘట్టం ముగిసిన నేపథ్యంలో రాయచూరు లోకసభ నియోజక వర్గంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. బరిలో మొత్తం 8 మంది అభ్యర్థులు ఉన్నప్పటికి ప్రధాన పోటీ కాంగ్రెస్ బీజేపీల మధ్యనే సాగనుంది. 2019 ఎన్నికల్లోనూ ఇదే రీతిలో కాంగ్రెస్ బీజేపీల మధ్యనే సాగినప్పుడు బీజేపీకి చెందిన రాజా అమరేశ్వర్ నాయక్ అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి బీవీ నాయక్‌పై విజయం సాధించారు. ప్రస్తుతం బీజేపీ తరపున సిట్టింగ్ ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ పోటీ పడుతుండగా కాంగ్రెస్ తన అభ్యర్థిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జీ కుమార్ నాయక్‌ను బరిలోకి దించింది. రాయచూరు లోకసభ నియోజక వర్గం పరిధిలో రాయచూరు సిటీ, రాయచూరు రూరల్, సింధనూరు, మాన్వి, లింగసుగూరు, దేవదుర్గతో పాటు యాదగిరి జిల్లాలోని యాదగిరి, సురపుర, శాహపూర్ విధానసభ క్షేత్రాలు ఉన్నాయి. నియోజక వర్గంలో మొత్తం 20,10,203 మంది ఓటర్లుండగా వీరిలో మహిళ ఓటర్లే ఎక్కువగా ఉండడం గమనార్హం. పురుష ఓటర్లు 9,94, 646 మంది ఉండగా మహిళ ఓటర్ల సంఖ్య 10,15,128గా ఉంది. ఒక్క యాదగిరి జిల్లాలోని సురపుర నియోజక వర్గంలో మినహా మిగతా ఏడు శాసనసభ సెగ్మెంట్ల పరిధిలో మహిళా ఓటర్లే అధికంగా ఉండడం గమనార్హం. లోకసభ ఎన్నికలతో పాటు రాయచూరు లోకసభ నియోజక వర్గం పరిధిలోని యాదగిరి జిల్లా సురపుర విధాన సభ స్థానానికి మే 7 న పోలింగ్ జరగనుంది. ఆ ఒక్క అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్లు మాత్రం రెండు బ్యాలెట్‌లపై తమ ఓటు వేయాల్సి ఉంది. కాగా రాయచూరు లోకసభ నియోజక వర్గం పరిధిలో బీజేపీ తరపున ప్రదాని నరేంద్ర మోదీ ప్రచారం చేస్తారని తొలుత వార్తలు వెలవడినా ఆయన ప్రచార సభ రద్దు చేసినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే ప్రత్యామ్యాయంగా ఆ పార్టీ తరపున ప్రచారం చేస్తున్న స్టార్ క్యాంపైనర్ ఎవ్వరన్నది ఇంకా స్పష్టం కాలేదు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో పాటు పలువురు మంత్రులు ప్రచారంలో పాల్గొననున్నారు.





కుమార్ నాయక్(కాంగ్రెస్) అమరేశ్వర్ నాయక్(బీజేపీ

హోసూరు జోన్

టైటాన్ సహకారంతో శౌచాలయ నిర్మాణం



టైటాన్ సంస్థ ప్రతినిధులతోఉపాధ్యాయులు, విద్యార్థులు

హోసూరు, ఏప్రిల్ 25: హోసూరులోని టైటాన్ ఇంజనీరింగ్, ఆటోమేషన్ సంస్థ ఆధ్వర్యంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. కృష్ణగిరి జిల్లా దొడ్డమంచి పంచాయతీ బిళిగుండు పంచాయతీ యూనియన్ మిడిల్ స్కూల్‌లో శౌచాలయ వ్యవస్థ కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయంతి వినతిపై సంస్థ సానుకూలంగా స్పందించి రూ.12లక్షలతో ఐదు శౌచాలయాలు నిర్మించారు. బుధవారం టైటాన్ ఇంజినీరింగ్ సీఎస్ఆర్ ప్రోగ్రామ్ హెడ్, జనరల్ మేనేజర్ షణ్ముగం పాల్గొన్నారు. జిల్లా రిసోర్స్ సెంటర్ అధికారి నికోలా ప్రకాశ్ ధన్యవాదాలు తెలిపారు. రెవరెండ్ ఆరుళ్‌జ్యోతి మాట్లాడుతూ గ్రామ విద్యార్థులకోసం మంచి పనులు చేసిన సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మురుగేశ్, కేశవన్, హరిహరన్, ప్రభు, రెవరెండ్ లూర్దుస్వామి, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

సరిహద్దులో ముమ్మర తనిఖీలు

హోసూరు, ఏప్రిల్ 25: కర్ణాటకలో శుక్రవారం పోలింగ్ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. బెంగళూరు జిల్లా ఆనేకల్ తాలూకా పరిధిలోని అత్తిబెలె పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర గౌడ నేతృత్వంలో తమిళనాడు నుంచి కర్ణాటకకు వచ్చే అన్ని వాహనాలను కట్టుదిట్టంగా తనిఖీ చేస్తున్నారు. తనిఖీ చేసిన వాహనాలు, డ్రైవర్, పేరు, ఫోన్ నెంబరు ఇతర వివరాలు నమోదు చేసుకున్నాక వెళ్లేందుకు అనుమతిస్తున్నారు.

వేడిమి నుంచి ఉపశమనానికి చర్యలు అవసరం

హోసూరు(కృష్ణగిరి), ఏప్రిల్ 25: కృష్ణగిరి జిల్లాలో కొన్ని రోజులుగా ఎండ వేడిమి అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు, పిల్లలు, గర్భిణీలు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్యాధికారులు సూచిస్తున్నారు. తగినంత నీరు తాగాలని, నీటిశాతం అధికంగా ఉండే పండ్లు, మజ్జిగ, కొబ్బరినీరు, తాటిముంజలు ఇతరత్రా తీసుకోవాలన్నారు. మీజిల్స్, మశూచి, చికెన్ పాక్స్, కామెర్లు, చర్మ వ్యాధుల ప్రభావాల నుండి రక్షించుకునేలా తగిన టీకాలు వేయించుకోవాలన్నారు.

అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ద్రవం, ప్రాణాలను రక్షించే మందులు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా వైద్యాధికారులకు సూచించారు. వేసవి నుంచి కాపాడుకునేలా బిగుతుగా ఉండే దుస్తులు కాకుండా తగినంత వదులైన బట్టలు కాటన్ బట్టలు ధరించాలని, కనీసం మూడు నుంచి ఐదు లీటర్లు నీరు తాగడం తప్పనిసరని సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు తప్పనిసరైతే మినహా సంచరించవద్దని సూచిస్తున్నారు. ఈమేరకు జిల్లా అధికారి కెఎం సరయు నేతృత్వంలో గురువారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. జిల్లా తల్లీబిడ్డల ఆరోగ్యం, వైద్యం ఇతర వైద్య చికిత్సలపై అవగాహన కల్పించారు. సమావేశంలో అసోసియేట్ డైరెక్టర్ ధర్మన్, కృష్ణగిరి వైద్య కళాశాల వైద్యశాల ప్రిన్సిపాల్ భూపతి, జిల్లా ఆరోగ్య శాఖాధికారి రమేశ్‌కుమార్, హోసూరు కార్పొరేషన్ వైద్యాధికారి ప్రభాకరన్, జిల్లాల్లా వైద్యాధికారులు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వారు పాల్గొన్నారు.



ఆరోగ్యశాఖ సమీక్షలో కలెక్టర్ సరయు

తాగునీటి కోసం గ్రామస్థుల ఆందోళన..!

● ఖాళీ బిందెలతో ధర్నాకు దిగిన మహిళలు

రాయచూరు, ఏప్రిల్ 25 : రాయచూరు తాలూకాలోని యాపలదిన్ని గ్రామంలో తాగునీటి సమస్య తీవ్ర రూపం దాల్చడంతో ప్రజలు ఆందోళనకు దిగారు. సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీపీఎం జిల్లా నాయకుడు కేజీ వీరేశ్ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చి నెలరోజులు గడుస్తున్నా పంచాయత్ రాజ్ అధికారులు సమస్య పరిష్కారం కోసం స్పందించకపోవడం బాధ్యతరాహిత్యమన్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని ప్రైవేటు యజమానులతో మాట్లాడి తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామంలో గతంలో వేసిన సీసీ రోడ్లు ధ్వంసం కాగా మురుగునీరంతా వచ్చి రోడ్లపైనే పారుతుండడంతో గ్రామంలో పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందన్నారు. దీంతో పాటు రెండు చోట్ల చెడిపోయిన బోరుబావులను మరమ్మత్తు చేసి ప్రజలకు తాగునీరు అందే ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ట్యాంకర్లను అందుబాటులో ఉంచి ప్రజలకు సమస్య లేకుండా చూడాలన్నారు. తాగునీటి సమస్యతో పాటు తీవ్ర కరువు పరిస్థితి నేపథ్యంలో ప్రజలు వలసబాట పడుతున్నందున ఉపాధి హామి పనులను 150 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు.

ఘనంగా కోట మారియమ్మ రథోత్సవం

హోసూరు, ఏప్రిల్ 25: హోసూరు మత్తిగిరి కూట్‌రోడ్డులోని కోటమారియమ్మ రథోత్సవం గురువారం ఘనంగా జరిగింది. మిడుగరపల్లి గ్రామం నుంచి అలంకరించి కోట మారియమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం హోసూరు కార్పొరేషన్ టాక్సేషన్ కమిటీ చైర్మెన్ 37వ వార్డు కౌన్సిలర్ చెన్నీరప్ప పట్టణ ప్రముఖులు శివన్న, పాపన్న, మణి, మునిరాజ్, మురుగన్, రవి, నీలకంఠన్ తదితర ప్రముఖులు రథాన్ని లాగారు. రథం మిడుగరపల్లి ప్రభుత్వ ఐటీఐ మీదుగా ఆలయానికి చేరుకుంది. ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉత్సవంలో అన్నాడీఎంకే మున్సిపల్ ప్రాంతీయ కార్యదర్శి వాసుదేవన్, మున్సిపల్ కౌన్సిలర్ మంజుళ మునిరాజ్, పెద్దసంఖ్యల్లో భక్తాదులు పాల్గొన్నారు



హోసూరు మత్తిగిరి రోడ్డులో కోటమారియమ్మ రథోత్సవ దృశ్యం